క్లుప్తంగా

విహారయాత్రలో సుర్జాపూర్ విద్యార్థులు


బస్సు వద్ద విద్యార్థులు

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్ జెడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థులు ఆదివారం విహార యాత్ర కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాకు వెళ్లారు. వెయ్యిస్తంభాల గుడి, రామప్ప ఆలయం, లక్నవరం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల విశిష్టతను ఉపాధ్యాయులు.. విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఊర్మిళ, ఉపాధ్యాయులు దురిశెట్టి శ్రీనివాస్, సీహెచ్ శ్రీనివాస్, సౌజన్య, లక్ష్మి, లచ్చన్న తదితరులు ఉన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ అబ్దుల్ హమీద్

ఖానాపూర్: ఈనెల5 నుంచి జరిగే ఇంటర్ వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఖానాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ అబ్దుల్ హమీద్ తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 290 మంది, రెండో సంవత్సరంలో 268 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి 8:30 గంటల్లోపే చేరుకోవాలని.. 8:45 గంటల తర్వాత వచ్చే వారిని అనుమతించబోమని పేర్కొన్నారు. సెల్‌ఫోన్‌కు అనుమతి లేదని.. పరీక్షకు కావాల్సిన రైటింగ్‌ప్యాడ్లు, పెన్నులు, హాల్‌టికెట్ వెంట తీసుకురావాలని సూచించారు.

గౌరవం పెరిగేలా చదువుకోవాలి


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దస్తురాబాద్: సమాజంలో గౌరవం పెరిగేలా విద్యార్థినులు ఉన్నత చదువులు చదువుకోవాలని ఎస్‌వో తిరుమల అన్నారు. దస్తురాబాద్ కేజీబీవీలో ఆదివారం ఇంటర్, పదోతరగతి విద్యార్థినులకు వీడ్కోలు వేడుకలు, వార్షికోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

సారంగపూర్: మండలంలోని మలక్‌చించోలి గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా ఆలయం వద్ద వీడీసీ, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి సల్లనం బళ్లు నైవేద్యాలుగా సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు దశరథ రాజేశ్వర్, భోజరాజు, కాల్వ నరేశ్, భోజన్న, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


మామడ : పరామర్శిస్తున్న ఐకేరెడ్డి

మామడ: మండలంలోని వస్తాపూర్ గ్రామంలో ఇటీవల మాజీ సర్పంచ్ సీతాబాయి అనారోగ్యంతో మృతిచెందింది. ఆదివారం బాధిత కుటుంబసభ్యులను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. మృతికి కారణాలను సీతాబాయి భర్త గంగారాం పటేల్‌ను అడిగి తెలుసుకున్నారు. రాందాస్, సీతారాం, భాస్కర్ ఉన్నారు.

ముధోల్‌లో..

ముధోల్: మండలకేంద్రంలోని మహాలక్ష్మీ గల్లీకి చెందిన మున్నూరుకాపు తాలూకా అధ్యక్షుడు రోళ్ల రమేశ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి.. ఆదివారం ముధోల్ వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ అఫ్రోజ్‌ఖాన్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాణిక్‌దాస్, నాయకులు తదితరులున్నారు.


ముధోల్ : పరామర్శిస్తున్న విఠల్‌రెడ్డి

చెరువులు నిండుగా.. పంటలు పచ్చగా

ఈ చిత్రంలో కన్పిస్తున్నది లక్ష్మణచాంద ఊర చెరువు. సరస్వతి కాల్వనీరు చెరువులోకి రావడంతో నిండుకుండలా మారింది. దీంతో పుష్కలంగా సాగునీరు ఉండటంతో చెరువు ఆయకట్టు భూముల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు.



- లక్ష్మణచాంద మండలంలో యాసంగిలో పెరిగిన సాగు విస్తీర్ణం
- సరస్వతి కాల్వతో తీరిన కష్టాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న కర్షకులు

లక్ష్మణచాంద: ఉత్తర తెలంగాణ వరప్రదాయని అయిన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సరస్వతి కాల్వ ద్వారా వస్తున్న నీటితో లక్ష్మణచాంద మండలంలోని గ్రామాల్లో ఉన్న చెరువులు నిండుకుండలా మారాయి. దీంతో ఆయా చెరువుల కింద ఆయకట్టు భూముల్లో రైతులు వరిసాగు చేస్తుండగా పంటలు పచ్చగా కళకళలాడుతున్నాయి. సాగునీరు పుష్కలంగా ఉండటంతో వర్షాకాలంలో మాదిరి అధిక విస్తీర్ణంలో యాసంగి పంటలను సాగు చేస్తున్నారు.

గొలుసుకట్టు చెరువులు..

భావితరాలకు సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు జిల్లాలోని మెజార్టీ ప్రాంతాల్లో గత పాలకులు గొలుసుకట్టు చెరువులు నిర్మించారు. గొలుసుకట్టు అంటే ఒక చెరువు నిండితే మరో చెరువును నింపుకొంటారు. లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్, వడ్యాల్, నర్సాపూర్, బాబాపూర్, బోరిగాం, రాచాపూర్, పీచర, ధర్మారం, పార్‌పెల్లి, లక్ష్మణచాంద, చామన్‌పెల్లి, తిర్పెల్లి, చింతల్‌చాంద, మల్లాపూర్ తదితర గ్రామాల్లో చెరువులు ఉన్నాయి. వీటిలో ఒక చెరువు నిండితే దాని నుంచి మరో చెరువును నింపుకొనే వీలుంది.

వడ్యాల్ గ్రామంలోని చెరువు నుంచి లక్ష్మణచాంద ఊర చెరువులోకి నీటిని తరలించి.. తద్వారా పుల్చేరు చెరువు, అక్కడి నుంచి చామన్‌పెల్లి ఊర చెరువు, తిర్పెల్లి చెరువు నుంచి చింతల్‌చాంద చిన్న చెరువు వరకు గొలుసుకట్టు చెరువులు ఉండటంతో ఒకదాని నుంచి మరొక చెరువులోకి నీటిని సులభంగా నింపుకోవచ్చు.


సాగవుతున్న వరి పంట

మండలంలో 6 వేల ఎకరాల సాగు..

లక్ష్మణచాంద మండలంలో యాసంగిలో వరి పంటను సుమారు 10,500 ఎకరాలలో సాగు చేస్తున్నట్లు వ్యవసాయాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అందులో సరస్వతి కాల్వ ద్వారా నిండిన చెరువులను నమ్ముకొని ఆరు వేల ఎకరాలను సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సరస్వతి కాల్వ ద్వారా సాగు నీరు రాకుంటే యాసంగిలో పంటలను భూములను బీళ్లుగా వదిలేసేవారు.

రెండెకరాల్లో సాగు చేస్తున్నా



సరస్వతి కాల్వనీటితో చెరువులు చెరువులు నిండుకుండలా మారాయి. సాగు నీటికి ఇబ్బంది లేకపోవడంతో ప్రస్తుతం వర్షాకాలం మాదిరి రెండెకరాల్లోవరి పంటను సాగు చేస్తున్నా.

– తేలు పద్మ, మహిళా రైతు, వడ్యాల్

చెరువులను నింపుకొన్నాం



సరస్వతి కాలువ ద్వారా యాసంగి పంటలకు సాగు నీరు రావడంతో మా గ్రామంలోని చెరువులను నింపుకొన్నాం. దీంతో గ్రామంలో గుంట భూమి ఖాళీ లేకుండా వరి పంటను సాగు చేస్తున్నారు.

– అశోక్, రైతు, చింతల్‌చాంద

ఫిర్యాదుల పెట్టె మాయం!



భైంసాటౌన్: రోగులకు అందుతున్న సేవలపై ఫిర్యాదులు, సలహాలు స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పట్టణంలోని ఏరియాస్పత్రిలో ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేసింది. అయితే ఆ ఫిర్యాదుల పెట్టె ప్రస్తుతం కనిపించడం లేదు. దీంతో ఆసుపత్రిలోని అసౌకర్యాలపై ఎలా ఫిర్యాదు చేయాలని ప్రజలు సందేహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఈవిషయమై దృష్టి సారించాలని కోరుతున్నారు.

మోదుగ పూల శోభితం

లక్ష్మణచాంద: ఏటా వేసవి ప్రారంభంలో మోదుగ చెట్టుకు పూసే గోగిపువ్వులు చూపరులను ఆకట్టుకుంటూ ఆహ్లాదం పంచుతాయి. వసంత రుతువులో పూసే ఈ ఎర్రటి పూలను హోలీ సందర్భంగా సహజ సిద్ధమైన రంగుల తయారీలో ఉపయోగిస్తుంటారు. గోగిపూలను వేడినీటిలో కాచి, వడబోసిన రంగునీటిని ఒకరిపై ఒకరు చల్లుకుంటూ హోలీ జరుపుకొంటారు.



పేదకుటుంబానికి పెద్ద కష్టం

- బైక్‌పై కొండముచ్చులు దూకడంతో కిందపడి గాయపడ్డ దంపతులు
- కోమాలోకి వెళ్లిన భార్య.. చికిత్స పొందుతున్న భర్త
- ఆలయానికి వెళ్లి వస్తుండగా ఘటన
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు


కోమాలోకి వెళ్లిన బాధితురాలు


శ్రీనివాస్-ప్రేమల దంపతులు (ఫైల్)

బ్యాంకు వివరాలు..

పేరు : మోతె ప్రేమల,
బ్యాంకు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ), ఖానాపూర్‌శాఖ
ఖాతా నంబర్: 213210100036118,
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: UBIN0821322

ఖానాపూర్: కూలీ పనులు చేసుకొని జీవనం సాగించే ఆ కుటుంబానికి పెద్ద కష్టమొచ్చింది. ఖానాపూర్ మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామానికి చెందిన మోతె ప్రేమల–శ్రీనివాస్ దంపతులు గత నెల 26న (శివరాత్రి పండుగరోజు) బూరుగుపల్లి ఆలయంలో జాగారం చేసి, గత నెల 27న ఉదయం గ్రామానికి వస్తుండగా సింగాపూర్ శివారులో వీరి బైక్‌పై కొండముచ్చులు దూకడంతో ఇరువురు తీవ్రంగా గాయపడ్డారు. ఈప్రమాదంలో శ్రీనివాస్‌కు పలు చోట్ల ఎముకలు విరుగగా నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి భార్య ప్రేమలకు మెదడులో రక్తం గడ్డకట్టడంతో కోమాలోకి వెళ్లింది. నిజామాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈమె చికిత్సకు రూ.ఆరు లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పినట్లు కుటుంబీకులు పేర్కొన్నారు. దాతలే స్పందించి వీరి కుటుంబానికి ఆర్థికంగా సాయం అందించాలని గ్రామస్తులు, వారి కుటుంబసభ్యులు కోరుతున్నారు.

వసూలు లక్ష్యం చేరేనా..!


ఆస్తిపన్ను వసూలు చేస్తున్న మున్సిపల్, రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

- భైంసా మున్సిపాలిటీలో ఆస్తిపన్ను లక్ష్యం రూ.5.67 కోట్లు
- ఇప్పటివరకు 32.14 శాతం వసూలు
- నెలాఖరుతో ముగియనున్న ఆర్థికసంవత్సరం

భైంసాటౌన్: ఆర్థిక సంవత్సరం ముగింపు గడువు ముంచుకొస్తోంది. దీంతో జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఆస్తి, నల్లా, ఇతర పన్నుల వసూలు వేగవంతం చేయాలని ప్రత్యేకాధికారి, స్థానికసంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. దీంతో భైంసా పట్టణంలో మున్సిపల్ అధికారులు పన్నుల వసూలు వేగవంతం చేశారు. మున్సిపల్ కమిషనర్ బి.రాజేశ్‌కుమార్ నేతృత్వంలో రెవెన్యూ సిబ్బందికి ప్రతిరోజు లక్ష్యం విధిస్తూ పన్నులు వసూలు చేయిస్తున్నారు. పన్ను చెల్లించని ఆస్తులను జప్తు చేస్తున్నారు. దీంతో కొందరు బకాయిదారులు పన్నులు చెల్లిస్తుండగా.. మరికొన్ని మొండి బకాయిలు లక్ష్యానికి అడ్డంకిగా మారాయి.

వేగవంతం చేశాం

పట్టణంలో ఆస్తిపన్ను వసూలు వేగవంతం చేశాం. రెవెన్యూ సిబ్బందికి రోజువారి లక్ష్యం విధించాం. తొమ్మిది మంది బిల్ కలెక్టర్లు రోజువారీగా పన్నులు వసూలు చేస్తున్నారు. పట్టణ ప్రజలు సైతం సహకరించి సకాలంలో పన్నులు చెల్లించాలి. తద్వారా పట్టణాభివృద్ధి సాధ్యపడుతుంది.

– బి.రాజేశ్‌కుమార్, కమిషనర్, భైంసా

రూ.1.81కోట్లు వసూలు..

పట్టణంలో 12,518 అసెస్‌మెంట్లు(ఇళ్లు, వ్యాపార సముదాయాలు) ఉండగా ఏటా ఆస్తిపన్ను డిమాండ్ రూ.2.33 కోట్లు ఉంటుంది. కాగా బకాయిలు పేరుకుపోతుండటంతో వాటిపై వడ్డీతో కలిపి ప్రస్తుత డిమాండ్ రూ.5.67 కోట్లకు చేరింది. అయితే, ఇప్పటివరకు వీటిలో 1.81 కోట్లు మాత్రమే వసూలయ్యాయి. అంటే 32.14 శాతమే లక్ష్యం చేరుకున్నారు. ఈనెల 31తో ఆర్థిక సంవత్సరం గడువు ముగియనుంది. ఈ నెలాఖరు వరకు ఇంకా రూ.3.84 కోట్ల వసూలు లక్ష్యం చేరుకోవడం సందేహంగానే అనిపిస్తోంది.

హాఫ్ మారథాన్‌లో ఖానాపూర్ వాసులు

ఖానాపూర్: క్యాన్సర్ బాధితుల సహాయార్థం పద్మపాణి సొసైటీ ఆధ్వర్యంలో కామారెడ్డిలో ఆదివారం నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో ఖానాపూర్ వాసులు పాల్గొన్నారు. స్టేడియం నుంచి 21 కిలోమీటర్ల మేర నిర్వహించిన పరుగుపందెంలో ఖానాపూర్ వాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డాక్టర్ కిరణ్‌కుమార్, రాజేందర్, రాజు, అశోక్, వెంకట్రాములు, శివ, ముషారఫ్, మహేశ్, దత్తు ఉన్నారు.


పరుగుపందెంలో పాల్గొన్న ఖానాపూర్ వాసులు

అటెన్షన్ ప్లీజ్.. మురుగునీటితో దుర్గంధం



భైంసాటౌన్: మురికి కుంటను తలపిస్తున్న ఈ దృశ్యం పట్టణంలోని రూరల్ పోలీస్‌స్టేషన్ మార్గంలో ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోనిది. డ్రెయినేజీపై నిర్మించిన కల్వర్టు శిథిలావస్థకు చేరడంతో చెత్తాచెదారం నిండి పూడిక పేరుకుపోయింది. దీంతో డ్రెయినేజీలో నుంచి మురికినీరు పైకి వచ్చి రోడ్డుపై పారుతోంది. దుర్గంధంతో ఇబ్బంది పడుతున్నామని.. మున్సిపల్ అధికారులు కల్వర్టు నిర్మించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: రాజేశ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, ఫోన్: 95151 21070

ప్రారంభానికి నోచుకోని అంగన్‌వాడీ కేంద్ర భవనం



చిన్నారులకు సులభంగా అర్థమయ్యేలా గీసిన చిత్రాలు



కొత్త భవనంలోకి మార్చరూ..

జిల్లాకేంద్రంలోని వెంకటాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆధునిక హంగులతో సుమారు ఐదేళ్ల కిందట నిర్మించిన మోడల్ అంగన్‌వాడీ కేంద్రం ఇప్పటికీ ప్రారంభించలేదు. ఈ ఊర్లోనే ఉన్న ప్రస్తుత అంగన్‌వాడీ కేంద్ర భవనం శిథిలావస్థకు చేరింది. 20 మంది చిన్నారులు వచ్చే ఈ కేంద్రాన్ని ఇరుకుగదిలో నిర్వహిస్తున్నారు. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి.. వర్షానికి ఊరుస్తుండటంతో టార్పాలిన్ కప్పి కాలం వెల్లదీస్తున్నారు. మోడల్ అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్


శిథిలావస్థకు ప్రస్తుత అంగన్‌వాడీ కేంద్ర భవనం